నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం 18 ఆగస్టు 2023

రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును అనుసరించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును అనుసరించాలని నిజామాబాద్ నగరంలోని నిరుద్యోగ యువత కలెక్టర్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువత ఎం.కపిల్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను వివిధ శాఖలలో సర్దుబాటు చేయడానికి జీవో నెంబర్ 81, 85ను తీసుకువచ్చిందని, దీనిపైన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు వీఆర్ఏలకు పదోన్నతులు క్రమబద్ధీకరణ సంబంధించి జీవో నెంబర్ 81, 85లను రద్దుచేసి, గతంలో ఉన్న వీఆర్ఏలను జిల్లాలోని పాత తేదీలలోనే సర్దుబాటు చేసి వారికి పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. హైకోర్టు చెప్పిన విధంగా అనుసరించాలంటూ, కోర్టుధిక్కరణ చేయవద్దని కోరారు. కార్యక్రమంలో సాయి, శివ, సతీష్, పాల్గొన్నారు.

అక్కాపూర్ శివారులో ఉద్రిక్తత



నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని అక్కాపూర్ గ్రామ శివారులో గల అటవీ భూములలో చెట్లను నరికివేసి అక్రమంగా భూములు దున్నుతున్నారని సమాచారం మేరకు చేరుకున్న అటవీశాఖ అధికారులకు, వడ్డెర కులస్తులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వడ్డెరులు అటవీ భూములను ట్రాక్టర్లతో దున్నడంతో అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. దీనితో అటవీశాఖ అధికారులకు, వడ్డెర కులస్తులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఘటనా స్థలానికి పోలీసులు, అటవీశాఖ ఉన్నతాధికారులు చేరుకునేలోపు భూమిని దున్నుతున్న కొంతమంది వ్యక్తులు ట్రాక్టర్లను వదిలిపెట్టి పోయారు. ప్రస్తుతం రెండు గ్రామాలలో భారీ పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

సమరానికి సై

- బోధన్‌లో ఎన్నికల ఢంకా మోగించిన ఎమ్మెల్సీ కవిత
- బూత్ కమిటీల సమావేశానికి భారీగా తరలివచ్చిన జనం
- ఊపందుకోని కాంగ్రెస్ ప్రచారం
- క్యాడర్ క్యాంపు సమావేశాలతో ప్రజల్లోకి బీఎస్పీ
- కేంద్ర ప్రభుత్వ పథకాలతో బీజేపీ నాయకుల ప్రచారం

మరో రెండు, మూడు నెలల్లో ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయ పార్టీలు ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్నాయి. బోధన్‌లో ఇప్పటికే ఎమ్మెల్సీ కవిత ఎన్నికల ఢంకా మోగించారు. బూత్ కమిటీ సమావేశాలను ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నారు. ఇక కాంగ్రెస్ ప్రచారం ఇంకా ఊపందుకోలేదు. క్యాడర్ క్యాంపు సమావేశాలతో ప్రజల్లోకి బీఎస్పీ వెళ్తుండగా.. బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలతో ప్రచారం నిర్వహిస్తున్నారు.



నవతెలంగాణ-బోధన్

ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ కార్యకర్తలను, నాయకులను సమావేశపరుస్తూ గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించడానికి బూత్ కమిటీలు ఏర్పాటు చేశారు. గత వారం రోజుల నుంచి బోధన్ నియోజకవర్గంలోని గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీలను ఎంపిక చేశారు. ఆగస్టు 16వ తేదీన బోధన్ పట్టణంలోని ఎన్ఎస్ఎఫ్ గ్రౌండ్‌లో నిర్వహించిన బోధన్ నియోజకవర్గం బూత్ కమిటీలు, కార్యకర్తల సమావేశానికి జనం భారీ సంఖ్యలో తరలిరావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపయింది. సమావేశానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొని ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరడంతో బోధన్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి షకీల్ ఆమేర్ అనే సంకేతం వచ్చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం నాడు బోధన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 29 వార్డుకు చెందిన కాలనీవాసులు భారీ సంఖ్యలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బూత్ కమిటీ కార్యకర్తల సమావేశంలో ఎడపల్లి మాజీ ఎంపీపీ గైని పోచయ్య ఎమ్మెల్సీ కవిత సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరడంతో ఇంకా చాలా మంది బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు కవిత ప్రకటించారు. బోధన్ పట్టణం జెండాలతో గులాబీమయం కావడంతో అధికార బీఆర్ఎస్ పార్టీ ఇప్పటి నుంచే ప్రచారం ప్రారంభించినట్లు కనిపిస్తుంది. రాబోయే ఎన్నికల్లో 80,000 ఓట్ల మెజారిటీతో బీఆర్ఎస్ పార్టీ బోధన్‌లో విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే షకీల్ ప్రకటించారు.

అలాగే బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాలలో ఇంటింటికీ తీసుకెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఆజాదికా అమృత్ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మమేకమవుతున్నారు. ఈ క్రమంలో బోధన్ అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి బీజేపీ కార్యకర్తలను, బాధితులను పరామర్శిస్తూ వారికి సహాయ సహకారాలు అందిస్తున్నారు. అలాగే అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను పరిశీలిస్తూ రైతులకు భరోసా కల్పించారు. ఈ క్రమంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తీరుపై బోధన్ పట్టణానికి, మండలానికి చెందిన సీనియర్ కార్యకర్తలు నాయకులు హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి ఎదుట ఎంపీ అర్వింద్, జిల్లా అధ్యక్షుని తీరుపై నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ పార్టీ మండల కమిటీల ఏర్పాటులో నిబంధనల ప్రకారం వ్యవహరించలేదని వారు ఎంపీ ధర్మపురి అర్వింద్, జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీ నరసయ్య ఏకపక్షంగా వ్యవహరించి మండల అధ్యక్షులను ప్రకటించారని బీజేపీ కార్యకర్తలు నాయకులు వారి తీరుపై మండిపడ్డారు. దాంతో పార్టీలో లుకలుకలు బయటపడ్డాయి. అలాగే గత 15 రోజుల క్రితం నిజామాబాద్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎంపీ ధర్మపురి అరవింద్ తీరుపై, జిల్లా అధ్యక్షుని తీరుపై మరోసారి బోధన్ మండల, పట్టణ నాయకులు కార్యకర్తలు తమ నిరసన వ్యక్తం చేశారు. దీంతో బీజేపీ పార్టీలో నాయకులకు ప్రజాప్రతినిధులకు సఖ్యత లేదనే విషయం బయటపడింది. బోధన్ పట్టణంలో సైతం గ్రూపు రాజకీయాలు ఉండడంతో కార్యకర్తలు అయోమయ స్థితిలో ఉన్నట్లు సమాచారం. మేడపాటి ప్రకాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డితో పాటు న్యాయవాది అడ్లూరు శ్రీనివాస్ సైతం బోధన్ అసెంబ్లీ సీటును ఆశిస్తున్నారు. ఈ క్రమంలో అధిష్టానం ఎవరికి టికెట్ ఇస్తుందో అనే విషయం ఇప్పటికీ అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. టికెట్టు ఎవరికి ఇచ్చినా వారి గెలుపు కోసం కృషి చేస్తామని నాయకులు చెప్పడం గమనార్హం. గత ఎన్నికల్లో ఆర్మూర్‌కు చెందిన అల్జాపూర్ శ్రీనివాస్ బోధన్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసే ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామని బీజేపీ నాయకులు ధీమాగా ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి బరిలో ఉంటారని ఇప్పటికే ప్రచారం నెలకొంది. దాంతో ఆయన నియోజకవర్గంలో ని ఆయా మండలాల్లో పర్యటిస్తూ కార్యకర్తలకు నాయకులకు అందుబాటులో ఉంటున్నారు. అయినా కాంగ్రెస్‌లో ఎన్నికల కోలాహలం కనబడడం లేదని ఆ పార్టీ కార్యకర్తలు పేర్కొంటున్నారు.

జాతీయ పార్టీగా ఉన్న బహుజన సమాజ్ పార్టీ గత రెండు నెలల నుంచి బోధన్ నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాలలో బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తూ క్యాడర్ క్యాంపులను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను ఆయా కమిటీలలో సభ్యులుగా చేరుస్తూ రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం ప్రయత్నిస్తున్నారు. బోధన్ నియోజకవర్గ ఇన్చార్జ్ సింగడి పాండు, జిల్లా ఇన్చార్జి గైని గంగాధర్, బామ్ సేఫ్ నాయకులు బోధన్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు. గత ఎన్నికల్లో బోధన్ నియోజకవర్గంలో నుంచి ఎమ్మెల్యేగా బరిలో నిలిచిన సింగడి పాండు ఈ ఎన్నికలలో సైతం పోటీకి సిద్ధంగా ఉన్నట్లు ఇప్పటికే వాల్ రైటింగ్‌తో ప్రచారం నిర్వహిస్తున్నారు. రాబోయే ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యర్థిగా ఉన్న పార్టీతో కలిసి బలమైన బీసీ నాయకుడిని బరిలో నిలిపేలా బీఎస్పీ పార్టీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు సమాచారం. దాంతో రాబోయే ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్లతో విజయం సాధిస్తామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. గత వారం రోజుల క్రితం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎవరికి సమాచారం లేకుండా బోధన్‌కు వచ్చి పార్టీ విజయంపై చర్చించినట్లు సమాచారం.

బోధన్ అసెంబ్లీ స్థానానికి తమ అభ్యర్థి పోటీలో ఉంటారని ఎంఐఎం అధినేత ప్రకటించిన ఇప్పటివరకు ఎలాంటి సంకేతాలు లేవని సమాచారం. కానీ అంతర్గతంగా బీఆర్ఎస్ పార్టీని ఓడించేందుకు వారి ప్రయత్నం చేస్తున్నట్లు వినికిడి. కానీ సీఎం కేసీఆర్‌తో ఉన్న దోస్తీ కారణంగా బోధన్‌లో మజ్లిస్ అభ్యర్థి పోటీపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా బోధన్‌లో ఎన్నికల సంగ్రామం ఊపందుకోవడంతో బీఆర్ఎస్ పార్టీల నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా కనబడుతున్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-తాడ్వాయి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్


మత్తు పదార్థాల పట్ల ఎవరూ బానిసలు కాకుండా అవగాహన కల్పించడంతో పాటు వాటిని సమూలంగా అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన నార్కో సమన్వయ కమిటీ మూడవ సమావేశంలో మాట్లాడుతూ.. ఆబ్కారీ, పోలీసు, రవాణా, అటవీ, వ్యవసాయ, విద్య, వైద్య, మహిళా సంక్షేమం తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో మత్తుపదార్థాల విక్రయం, అక్రమంగా గంజాయి సాగుచేస్తున్న పంటలను గుర్తించి కేసులు నమోదు చేసి న్యాయస్థానం ముందు నిలబెట్టాలని అన్నారు. అక్రమ మాదకద్రవ్యాల రవాణా, విక్రయంపై ఏమైనా సమాచారం తెలిస్తే వెంటనే కమిటీ దృష్టికి తెస్తే నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. పారిశ్రామిక ప్రాంతాల చుట్టు పక్కల, పాఠశాల, కళాశాల పరిసర ప్రాంతాలలో మత్తుపదార్థాల విక్రయం జరిగే అవకాశాలుంటాయని, ఆ ప్రాంతాలలో ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీ చేయాలని సూచించారు. వీధి బాలలు, పాఠశాల, కళాశాల విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా అటు తల్లిదండ్రులతో పాటు, ఉపాధ్యాయులు వారి నడవడిక, ప్రవర్తనను గమనిస్తుండాలన్నారు. ప్రారంభ దశలోనే గుర్తిస్తే సైక్రియాటిస్టు ద్వారా తగు కౌన్సెలింగ్ ఇచ్చివారిలో పరివర్తన తేగలమన్నారు.

జిల్లాలోని ప్రతి పాఠశాల, కళాశాలలో వివిధ కార్యక్రమాలతో పాటు మత్తుప దార్థాల పట్ల విద్యార్థులకు అవగాహన కలిగించు టకు కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓ, ఇంటర్మీడియేట్ అధికారులకు సూచించారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపులలో డ్రగ్స్ అమ్మకుండా చూడాలని, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారికి కంటి పరీక్షలు నిర్వహించి, ఆ వ్యసనం నుంచి బయటికి వచ్చేలా చికిత్స అందించాలని వైద్యాధికారికి సూచించారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారిని గుర్తించి పునరావాస కేంద్రంలో వసతి కల్పిస్తూ వారిలో మార్పు తెచ్చేందుకు కృషిచేయాలని, మహిళా శిశు సంక్షేమాధికారికి సూచించారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులు మత్తుపదార్థాలకు అలవాటు పడతారని, అటువంటి అనుమానాస్పద కార్మికులు పరిశ్రమలో పనిచేస్తున్నారా అని పారిశ్రామిక యాజమాన్యాలతో సమాచారం తీసుకొని కమిటీ దృష్టికి తేవాలని సూచించారు. సర్పంచు, పంచాయతీ కార్యదర్శులను, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తూ క్షేత్ర స్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మంచి సమాజం నిర్మించడమే మన లక్ష్యమని అందుకు ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేస్తూ సమాచారాన్ని చేరవేయాలని కోరారు. సమావేశంలో ఆర్డీఓ వాణి, డీఈఓ రాజు, వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, వైద్య శాఖ డీపీఓ పద్మజ, ఫారెస్ట్ రేంజ్ అధికారి రమేష్, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికపై ఉన్న ప్రేమ హాస్టళ్లపై లేదా?

- విద్యాశాఖ అధికారులు, ఎమ్మెల్యే హాస్టల్లో వచ్చి బస చేయాలి
- ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-నందిపేట్



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

శ్మశాన వాటికలపై ఉన్న ప్రేమ హాస్టళ్లపై లేదా..? అని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశ్నించారు. విద్యాశాఖ అధికారులు, ఎమ్మెల్యే హాస్టళ్లలో వచ్చి బస చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మండలంలోని ఐలాపూర్ గ్రామంలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్ భవనం పునర్నిర్మాణం చేయాలని ట్రంకు పెట్టెలతో రోడ్డుపైన బైటాయింపు రాస్తారోకో నిర్వహించారు. అదేవిధంగా 'ఎమ్మెల్యే ఎమ్మార్వో రావాలి' అంటూ నినాదాలు చేశారు. సుమారు రెండు గంటల పాటు విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో పరిస్థితి అధ్వానంగా మారుతున్న పట్టించుకోకుండా శ్మశాన వాటికల్ని ఐదు కోట్ల రూపాయలతో అందంగా తీర్చిదిద్దుతూ విద్యారంగాన్ని విస్మరిస్తూ కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగపడే వాటిపైనే నిధులను ఖర్చు చేస్తూ హాస్టల్లో భవనం పూర్తిస్థాయిలో శిథిలావస్థలో ఉన్న పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు బిల్డింగ్ కూలి విద్యార్థులకు ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. అదేవిధంగా సంక్షేమ హాస్టల్లో సుమారు 6 నెలలుగా మెస్ ఛార్జీలు లేక అనేక అవస్థలు పడుతున్నారని, పెండింగ్‌లో ఉన్న మెస్ ఛార్జీలు విడుదల చేయాలని అన్నారు. లేని పక్షంలో ప్రజా ప్రతినిధుల ఇంటిముందు వచ్చి ఆందోళన చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజ్, జిల్లా కమిటీ సభ్యులు జవహర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభానికి ముస్తాబైన నూతన పాఠశాల



ప్రారంభానికి సిద్ధమైన పాఠశాల

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని మన ఊరు మన బడి పథకంలో భాగంగా నిర్మితమైన నూతన పాఠశాల భవనం ప్రారంభానికి ముస్తాబైంది. మన ఊరు మన బడి పథకంలో భాగంగా నూతన భవనం నిర్మాణానికి గాను ప్రభుత్వం రూ.కోటి 86 లక్షల నిధులు విడుదల చేయడంతో 12 గదుల నిర్మాణ పనులు పూర్తి చేశాడు. గత రోజుల్లో గదుల కొరత ఉండడంతో నేడు పాఠశాలలో గదుల సమస్య తీరిపోవడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ఈ భవనం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్నట్టు సమాచారం.

ఆరో తరగతి ప్రవేశాలకు 25 గడువు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని జవహర్‌లాల్ నెహ్రూ నవోదయ విద్యాలయంలో 2023-2024 విద్యా సంవత్సరానికి గానూ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మను జె యోహన్ గురువారం తెలిపారు. ఆరో తరగతిలో 8 సీట్లు ఉన్నాయని విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పసుపు ధర రూ.14000

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో పసుపు ధర గురువారం రూ.14వేలు పలికింది. 2023 సంవత్సరానికిగానూ పసుపు పంట ఆ సీజన్‌లో రూ.6000 నుంచి 7000 వరకు ధర పలికింది. రైతులు వద్ద పంట లేని సమయంలో ధర పెరగడం గమనార్హం.

విరిగిపడిన భారీ వృక్షం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని నిజాంసాగర్-బొగ్గు గుడిసె మార్గమధ్యలో ప్రధాన రహదారిపై రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షం విరిగిపడింది. దీంతో సుమారు మూడు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాగా ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజేశ్వర్, గ్రామపంచాయతీ కార్యదర్శి డి.గంగారం, విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని విరిగి పడిన వృక్షాన్ని తొలగించేందుకు తీవ్రంగా కృషి చేశారు. జేసీబీ తీసుకొచ్చి తొలగించాలని ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అనంతరం కటింగ్ మిషన్‌లను తీసుకొచ్చి తొలగించారు.

గాంధీ చలన చిత్రం తిలకించడానికి

విద్యార్థులు ఉత్సాహంతో వస్తున్నారు

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-తాడ్వాయి



సినిమాను తిలకిస్తున్న విద్యార్థులు

గాంధీ చలన చిత్రం తిలకించడానికి విద్యార్థిని, విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో వస్తున్నారని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, వారిలో జాతీయ భావం పెంపొందించేందుకే రాష్ట్ర ప్రభుతం ఉచితంగా గాంధీ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నదని అన్నారు. గురువారం కామారెడ్డిలోని 4 సినిమా హాళ్లు, బాన్సువాడలో 2 థియేటర్లు, బిచ్కుంద, పిట్లం, నాగిరెడ్డిపేటలోని ఒక్కో సినిమా హాళ్ళో చిత్రం ప్రదర్శించగా 26 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 5,072 మంది విద్యార్థులు ఎంతో ఆసక్తిగా చిత్రాన్ని తిలకించి భావోద్వేగానికి లోనయ్యారన్నారు. ఈ నెల 20న ఆదివారం మినహా 24వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాన్నం 1:30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు చిత్రాన్ని తిలకించే విధంగా రవాణ శాఖతో సమన్వయం చేసుకుంటూ విద్యాశాఖ పాఠశాలల వారీగా షెడ్యూల్ రూపొందించి విద్యార్థులను సినిమా హాళ్లకు తీసుకెళ్లి తిరిగి గమ్యస్థానాలకు క్షేమంగా చేరుస్తున్నదని తెలిపారు. కామారెడ్డిలోని ప్రియా 70ఎంఎంలో శాంతినికేతన్, ఆర్చిడ్స్, శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యార్థులతో మండల్ విద్యాధికారి ఎల్లయ్య చిత్రం తిలకించారు.

పరీక్షల పేరుతో ఏఎన్ఎం సహనానికి పరీక్ష పెట్టద్దు

- సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ హితవు

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఒంటికాలిపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్ఎంలు

పరీక్షల పేరుతో ఏఎన్ఎం సహనానికి పరీక్ష పెట్టద్దని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ హితవు పలికారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మూడవరోజు గురువారం నిరవధిక సమ్మెలో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో మోకాళ్ళపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. కరోనా వారియర్స్ పేరుతో కొనియాడిన ఏఎన్ఎంలను పరీక్ష విధానం పేరుతో వారి సహనానికి మరింత పరీక్ష పెట్టడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని అన్నారు. 20 ఏళ్ల సర్వీసును పక్కనపెట్టి పరీక్షల విధానం ఎందుకని ప్రశ్నించారు. పరీక్షలను రద్దుచేసి ఏఎన్ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మె విరమించేది లేదని అన్నారు. సమ్మెకు తెలంగాణ రక్షణ సమితి నాయకులు పిప్పిరి లావణ్య, రాథోడ్ సాయి కుమార్ లు హాజరై మద్దతు ప్రకటించారు. ఏఎన్ఎం యూనియన్ నాయకులు పుష్ప, కవిత, ధనమ్మ గంగ జమున, ప్రమీల, సరోజ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- ఎంపీ బీబీ పటేల్ కు వినతి

నవతెలంగాణ-లింగంపేట్



ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సెన్సార్ బోర్డు మెంబర్ రామకృష్ణ గుప్తా జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్‌ను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యులు చాలామంది నిరుపేదలు ఉన్నారని ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే వారి కుటుంబాలకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొ న్నారు. ఆర్యవైశ్యులలో చాలామంది పేదలు ఉన్నారని, ప్రత్యేక కార్పొరేషన్ లేక కుటుంబ పోషణ భారమై నేడు ప్రైవేట్‌లో జీతాలను చేసుకుంటు న్నారన్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని వారికోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా నిరుపేదలు అయిన ఆర్యవైశ్యులకు లబ్ధిచేకూరుతుందని, దీని ద్వారా పేదలైన ఆర్యవైశ్యులకు ప్రభుత్వం చేయి అందిచి నట్లు అవుతుందని, వారి అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడినట్లు అవుతుందన్నారు. ఆర్యవైశ్యుల కార్పొరేషన్ ఏర్పాటుపైన ప్రత్యేక చొరువ తీసుకొని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి.. కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందించి ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు.

రైతులకు నష్టపరిహారం ఏదీ..?

- ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి
- టీజేఎస్ నియోజకవర్గ ఇంచార్జి డా.నిజ్జనరమేష్

నవతెలంగాణ-గాంధారి

వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఎందుకు ఇవ్వలేదని టీజేఎస్ నియోజకవర్గ ఇంచార్జి డా.నిజ్జనరమేష్ ప్రశ్నించారు. గురువారం మండలంలోని గౌరారం గ్రామంలో నిజ్జన రమేష్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ఎల్లారెడ్డిలో అభివృద్ధి జరుగుతుందన్నారు. కేటీఆర్ మాటలు పెద్ద మాయమాటలు తప్ప ఏం లేదని, డబుల్ బెడ్ రూమ్‌లు ఎన్ని కట్టించారో చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నష్టపోయిన రైతులకు రూ.10వేలు ఇస్తానని మోసం చేశారని, ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని పెండింగ్ ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని మండిపడ్డారు. రైతులు బోర్లు వేసి అప్పులు ఎక్కువై దుబాయ్‌కు వెళ్తున్నారని, కనీసం చనిపోతే తెచ్చే పరిస్థితి లేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వలసలు ఎక్కువయ్యాయని తెలిపారు. బెల్టుషాపులు పెంచి యువతను ఆగం చేస్తున్నారని, ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బతికున్న రైతులకు భరోసా ఇవ్వకుండా చనిపోయిన రైతుబీమా ఇచ్చినమని గొప్పలు చెప్పడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ దుర్గారెడ్డి, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, విద్యార్థి నాయకులు విజయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని భూంపల్లి గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను గురువారం వేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డా.ఆర్.రమేష్, భూంపల్లి సర్పంచ్ సంబు లలితా బాయి, ఎంపీపీ గైని అనుసూయ, విజయ డెయిరీ అధ్యక్షులు భూంరెడ్డి, విజయ డెయిరీ సూపర్‌వైజర్ రమేష్, సంజీవ్, పశుగణన సహాయకులు డి.జుగల్ కిషోర్, సిబ్బంది ఇస్మాయిల్, సాయికుమార్, గోపాల మిత్రులు మురళి, కాశిరెడ్డి, రాజేశ్వర్, పాడి రైతులు రవి, రమేష్, శివాజీ, రాకేష్, సత్యనారాయణ, నాగేష్, రాజేశ్వర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ ఎంపీపీ, వైస్ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

నవతెలంగాణ-రెంజల్



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపీటీసీలు

ఎంపీపీ రజిని కిషోర్, వైస్ ఎంపీపీ యోగేష్‌పై ఎంపీటీసీలు బోధన్ ఆర్డీవో రాజాగౌడ్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ప్రభుత్వ పథకాలను సైతం ప్రజల్లో తెలియజేయకుండా వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో, తాము వ్యక్తిగతంగా అవిశ్వాసానికి మద్దతు ఇచ్చా మని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు చింతకుంట లక్ష్మి, అసాద్ బేగ్, ఎస్.కె అహమ్మద్, ఈద గంగలత, అఙ్మల్ ఉన్నిసా తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
శుక్రవారం 18 ఆగస్టు 2023

గృహలక్ష్మి సర్వే

నవతెలంగాణ-మోపాల్



మండల కేంద్రంలో గృహ లక్ష్మీ పథకానికి వచ్చిన దరఖాస్తులపై ఎంపీడీవో లింగం నాయక్ ఆధ్వర్యంలో గురువారం లబ్దిదారుల ఇంటికి వెళ్లి వెరిఫై చేశారు. కార్యక్రమంలో ఎంపీవో ఇక్బాల్, రాష్ట్ర సెక్రెటరీల ఫోరం అధ్యక్షుడు, మండల సెక్రెటరీ మధుసూదన్ రెడ్డి, లబ్ధిదారులకు గృహలక్ష్మి గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నియమావళి ప్రకారం అసలైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. పల్లె బృహత్ పథకంలో చెట్లను ఎంపీడీవో లింగం నాయక్ తనిఖీ చేశారు. ఒక్క చెట్టు కూడా ఎండిపోకుండా చూడాల్సిన బాధ్యత సెక్రెటరీ పైన ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సెక్రెటరీలు పాల్గొన్నారు.

నగదు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-ఏర్గట్ల



ఆగస్టు 15న నిర్వహించిన క్రీడల్లో భాగంగా జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్ తండ్రి గుల్లే అబ్బన్నోళ్ల రాజన్న, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తుపాకుల శ్రీనివాస్ గౌడ్ తండ్రి తుపాకుల రాజా గౌడ్ స్మారకార్థం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో గెలుపొందిన యువకులకు మొదటి బహుమతిగా 4000 రూపాయలను రాయల్ గాయ్స్ యూత్ కు గుల్లే రాజేశ్వర్ అందజేశారు. అలాగే ద్వితీయ బహుమతి కింద కబడ్డీ అసోసియేషన్ యూత్‌కు 3000 రూపాయలను బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి,యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా డిచ్‌పల్లి

- సీఎంసీలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు భవనం పరిశీలన
- ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం
- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎడ్యుకేషన్ హబ్‌గా డిచ్‌పల్లి విరాజిల్లుతుందని, సీఎంసీలో డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం భవనాలను పరిశీలించి మహిళా వసతి గృహంలోనే ఈ విద్యాసంవత్సరంనుంచే తరగతులు ప్రారంభిస్తామని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. డిచ్‌పల్లి మండలానికి మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం సీఎంసీ ఆవరణలోని భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికల హాస్టల్ భవనాన్ని ఎంపిక చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డిచ్ పల్లి ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు సీఎం కేసీఆర్ డిగ్రీ విద్య కోసం దూరప్రాంతాలకు విద్యార్థులు వెళ్లకుండా డిగ్రీ కళాశాల మంజూరు చేశారన్నారు. ప్రజల తరపున సీఎం కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. డిచ్‌పల్లిలో ఒకటవ తరగతి నుండి మొదలుకుని ఉన్నత విద్యకు తెలంగాణ యూనివర్సిటీ, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఉన్నాయని, ఇప్పుడు డిగ్రీ కళాశాల ఏర్పాటుతో డిచ్ పల్లి ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతుందన్నారు.

ఇదే విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చదువు పూర్తయిన వెంటనే వారికి ఉద్యోగ, ఉపాధి లభించేలా కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, ఉన్నత విద్యామండలి చైర్మన్ రిక్క లింబాద్రిని కలిసినట్లు తెలిపారు. డిగ్రీ కళాశాల కోసం భవనాన్ని ఐదేళ్ల పాటు ఇవ్వడానికి ముందుకు వచ్చిన సీఎంసీ యాజమాన్యానికి, బోర్డు సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవనం మరమ్మత్తుల కోసం అవసరమైన నిధుల మంజూరు కోసం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ను కలిసి మాట్లాడుతానని, సిడిపి, ఎస్డిఎఫ్ నుండి సైతం నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సీఎంసీ ప్రాపర్టీబోర్డు సభ్యులు శ్యాంసన్, చర్చి ఫాదర్ ఏసు కుమార్ స్టీఫెన్, దినకర్, ప్రమోద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్ రెడ్డి, నారాయణరెడ్డి, సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్, పార్టీ నాయకులు శక్కరికొండ కృష్ణ, మోహన్ రెడ్డి, ఎంపిటిసి ల ఫోరం అధ్యక్షులు సాయిలు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నయీమ్, యూత్ అధ్యక్షులు అమీర్ ఖాన్, సర్పంచులు పాపాయి తిరుపతి, నడ్పన్న కార్యకర్తలు తదితరులున్నారు.



స్థలం పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆకతాయిల అరెస్ట్

- లారీ డ్రైవర్‌పై దాడి ఘటనలో

నవతెలంగాణ-మోర్తాడ్

జాతీయ రహదారి 63 తహసీల్దార్ కార్యాలయం సమీపంలో బుధవారం రాత్రి రహదారిపై వెళ్తున్న వాహనాలను అడ్డగించి దౌర్జన్యానికి పాల్పడుతున్న ఆకతాయిలు ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. కాళేశ్వరం నుండి ఇసుకతో నిజామాబాద్ వైపు వెళుతున్న లారీని ఆపి కట్టెలతో డ్రైవర్ పై దాడికి పాల్పడుతూ వాహన అద్దాలను ధ్వంసం చేశారు. లారీ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడికి పాల్పడిన వారిలో మోర్తాడ్‌కు చెందిన అబ్బు, సన్నీ. సురేశ్, ఫజ్జు, ఉమర్, కల్యాణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు.

నుడా చైర్మన్‌ని కలిసిన నాయకులు



నుడా చైర్మన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం(పి)లో నుడా చైర్మన్ చైర్మన్ ఈగ సంజీవరెడ్డి నివాసం వద్ద రూరల్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలతో కిక్కిరిసిపోయింది. పూలమాలలు, పుష్పగుచ్చాలతో సన్మానించారు. జిల్లా రెడ్డి సంఘాల ఐక్యవేదిక సభ్యులు ఈగ రమేష్ రెడ్డి తదితరులు ఆయనను సన్మానించారు. ఈగ సంజీవరెడ్డి మాట్లాడుతూ తనకు నుడా చైర్మన్ పదవి ఇచ్చిన రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్త, ఎమ్మెల్సీ కవిత, మంత్రి ప్రశాంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఉన్న ప్రతి కార్యకర్తకి ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తిస్తారని ఆయన తెలిపారు. మంత్రి ప్రశాంత్ రెడ్డిని వేల్పూర్‌లో కలిశారు. కార్యక్రమంలో డైరెక్టర్ అభిలాష్ రెడ్డి, సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిరమిడ్ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-ఆర్మూర్

డివిజన్ పరిధిలోని నాగంపేట గ్రామంలో గురువారం రాజరాజేశ్వర పిరమిడ్ ధ్యాన మందిరం నిర్మాణం కొరకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. సుభాష్ పత్రీజీ ఆశయ సాధనకు సీనియర్ పిరమిడ్ మాస్టర్లు, ధ్యాన దంపతులు మమతా శ్రీనివాస్ మాస్టర్ల ఆధ్వర్యంలో పిరమిడ్ నిర్మాణంకోసం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పి ఎస్ ఎస్ ఎమ్ నవనాథపురం కమిటీ సభ్యులు అడ్వకేట్ సాయి కృష్ణ రెడ్డి, నల్ల గంగారెడ్డి, శేఖర్ రెడ్డి , అమరవాజి శ్రీనివాస్ , నిశాంత్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మధు శేఖర్‌కు పలువురి శుభాకాంక్షలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రాష్ట్ర హెల్త్ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ మధు శేఖర్‌ను మండల వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి జక్రాన్ పల్లి మాజీ సర్పంచ్ నర్సారెడ్డి మండల కోఆప్షన్ నెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్ గురువారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు . ఆర్మూర్ పట్టణంలో గల ఎంజె హాస్పిటల్ లో మధు శేఖరును కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అక్రమ్ ఖాన్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.



మధుశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

హెడ్ కానిస్టేబుల్‌కు సేవా పథకం

నవతెలంగాణ-ఏర్గట్ల

కొన్ని రోజులుగా ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌లో సేవలందిస్తున్న శ్యామల భాస్కర్ కు అతి ఉత్ కృష్ట్ సేవా పథకాన్ని ఆగస్టు 15 సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ మాట్లాడుతూ... సేవలను గుర్తించి ప్రభుత్వం సేవా పథకాన్ని అందజేసినందుకు ఆనందంగా ఉందని అన్నారు.

తపస్విలో పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి తపస్వి స్వచ్ఛంద సేవా సంస్థ పాఠశాలలో గురువారం బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అబ్బ గోని అశోక్ గౌడ్ జన్మదిన సందర్భంగా పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తపస్వి స్కూల్లో చదివే పిల్లలకు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బిసి సంక్షేమ సంఘం బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షులు దాసరి మూర్తి, ఆర్మూర్ మండల అధ్యక్షులు గోజుర్ మహిపాల్, మండల ఉపాధ్యక్షులు సాయిలు, మెండోరా ప్రదీప్ నరేష్, జోయల్, జరూష, తపస్వి యాజమాన్యం పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలి



నవతెలంగాణ-ఆర్మూర్

ప్రతి విద్యార్థి తప్పనిసరిగా క్రీడలలో పాల్గొనాలని జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎల్ మధుసూదన్ రెడ్డి అన్నారు . పట్టణంలోని సంక్షేమ పాఠశాల క్రీడా మైదానంలో గురువారం మేజర్ లీగ్ బేస్ బాల్ కప్ ఎంపిక పోటీల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్‌లో హైదరాబాదులో జరిగే పోటీలలో జిల్లా జట్టు విజయం పొందడానికి కృషి చేయాలి అన్నారు. క్రీడాకారులకు 12,500 రూపాయల విలువగల 50 బేస్‌బాలు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ దుర్గా రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడల్లో పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బి మల్లేష్ గౌడ్, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు సాఫ్ట్ బాల్ అకాడమీ కోచ్‌లు పాల్గొన్నారు.

జోడోయాత్రపై ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు

- పీసీసీ ప్రచార కమిటీ నాయకులు కోలా వెంకటేష్

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న కోలా వెంకటేష్

రాహుల్ గాంధీ జోడో యాత్రపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అవహేళన చేయడం సిగ్గుచేటని పిసిసి ప్రచార కమిటీ నాయకులు కోలా వెంకటేష్ అన్నారు. పట్టణంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బోధన్‌లో జరిగిన సమావేశంలో కల్వకుంట్ల కవిత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రపై చేసిన అనుచిత వాఖ్యలు ఆమె మానసిక స్థితికి నిదర్శనం అని అన్నారు. రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి కవితకు లేదని తెలిపారు. పిల్లి 100 ఎలుకలు తిని హజ్ యాత్రకు పోయిందని అనటం సిగ్గుచేటఅని అన్నారు. అసలు నేరాలు చేసి ప్రజల్లో తిరుగుతుంది కల్వకుంట్ల కవిత అని, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌తో వేల కోట్లు దోచుకొని బిజెపీతో చేతులు కలిపి జైలుకి పోకుండా బయట తిరుగుతున్నారని అన్నారు. మహిళా సర్పంచ్ తను చేసిన పనులకు బిల్లులు రాకుండ స్థానిక ఎమ్మెల్యే కక్ష సాధింపులకు గురి చేస్తే ఆత్మహత్యాయత్నం చేసుకుందని తెలిపారు. సాటి మహిళ అయి కూడ ఇప్పటికీ కనీసం పరామర్శించిన పాపన పోలేదు అని అన్నారు. కవితకు చిత్తశుద్ధి ఉంటే ఆ సర్పంచ్ కు బిల్లులు వెంటనే విడుదల చేసి ఆమె సస్పెన్షన్ ఎత్తి వేసేలా చూడాలని డిమాండ్ చేశారు. నాయకులు మీర్ మాజీద్ మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత బోధన్‌లో 100 ఎలుకలను చంపిన పిల్లి హజ్ యాత్రకు పోయిందని అనటం ముస్లిం సామాజిక వర్గం అందరిని అవమానించటం అని అన్నారు. హజ్ వెళ్లే భక్తులు పాపలు నేరాలు చేసిన వారే అనె విధంగా ఉన్నాయని, వెంటనే కవిత ఆ మాటలు వెనక్కి తీసుకోని బహిరంగంగా క్షమాపణలు కోరాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జిమ్మి రవి, అబ్దుల్ ఫాయిమ్, బట్టు శంకర్, హబీబ్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరమర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ధర్పల్లి



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ మజీద్ మాతృమూర్తి గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. అయన వెంట ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్, మైపాల్ యాదవ్,సొసైటీ చేర్మెన్ మల్లికార్జున్, రాజపాల్ రెడ్డి, సుభాష్, నజీర్, నయీమ్ ఉన్నారు.

అరెస్టులపై నల్లబ్యాడ్జీలతో నిరసన

- సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆధ్వర్యంలో...

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/నవీపేట్



కమ్మర్‌పల్లిలో..



నవీపేట్‌లో..

మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు హైదరాబాద్‌లో బుధవారం చలో ఎస్‌పిడి కార్యాలయం ముట్టడి సందర్భంగా అక్రమ అరెస్టులకు నిరసనగా భోజన విరామ సమయంలో కమ్మర్ పల్లి జేఏసీ సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జ్ లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమ్మర్ పల్లి కేజీబీవీ ప్రత్యేక అధికారిణి గంగా మణి మాట్లాడుతూ సమగ్ర శిక్ష డీపీవోలో పనిచేస్తున్న ఉద్యోగులను, కేజీబీవీలో పనిచేస్తున్న ఎస్ఓ లు, సిఆర్ టి, పీజీ సిఆర్ టి, నాన్ టీచింగ్ సిబ్బంది తోపాటు మండల స్థాయిలో పనిచేస్తున్న ఎంఐఎస్-కో ఆర్డినేటర్ లు, కంప్యూటర్ ఆపరేటర్ లు, సిఆర్ పి లు, ఐఈఆర్ పి లు, మెస్సెంజర్లు, పిటిఐలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఆ లోపు ఉద్యోగులందరికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నవీపేట్: సమగ్ర శిక్ష ఉద్యోగులు ముఖానికి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. హైదరాబాదులోని చలో ఎస్ పిడి కార్యాలయం ముట్టడి సందర్భంగా పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టులు చేసినందుకు నిరసనగా నవీపేట్ మండల కేంద్రంలోని ఎంఆర్సి, మోకన్ పల్లి కేజీబీవీ అద్యోగులు నిరసన వ్యక్తం చేశారు.

గృహలక్ష్మి పథకానికి సమయం పొడిగించాలి

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులకు పంపిణీ చేయాలి

నవతెలంగాణ-మోపాల్/కమ్మర్‌పల్లి/డిచ్‌పల్లి/నవీపేట్/మాక్లూర్



మోపాల్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



కమ్మర్‌పల్లిలో..

గృహలక్ష్మి పథకానికి సమయం పొడిగించాలని బిజెపి మండల అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో మండల ఇన్చార్జి తాసిల్దార్ మునీరుద్దీన్ కి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే 3 లక్షల రూపాయలు సరిపోవని కనీసం స్లాబు కూడా కట్టుకోవ డానికి వీలుండదని, ఐదు లక్షల పెంచాలని అన్నారు. సరైన అవగాహన లేక ఇంకా చాలామంది అప్లై చేయలేదని, ఆ సమయాన్ని కూడా పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో అరికెల శ్రీకాంత్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ విఫలమైందని గురువారం భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు కట్ట సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసిల్దార్ భాస్కర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందించాలన్నారు. నిరుద్యోగ భృతి, ఉచిత ఎరువులు, దళిత బంధు, బీసీ బంధు, కొత్త రేషన్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు వడ్డీతో సహ పూర్తి రుణాలు మాఫీ చేసి ఉచితంగా ఎరువులు అందించాలన్నారు. కార్యక్రమంలో రేంజేర్ల గంగాధర్, చింత ప్రవీణ్, కొమ్ముల సంతోష్, బలరాం, యాదగిరి, చింత హన్మంత్, వెంకట్ రెడ్డి, భాగ్యరాజ్, రాజేందర్, బీజేపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులకు పంపిణి చెయ్యాలని, స్థలం లేని వారికి స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేస్తూ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గురువారం ఇందల్ వాయి తహసిల్దార్ వెంకట్రావు కు అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు నాయుడు రాజన్న మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందజేస్తామని హామీలిచ్చి తొమ్మిదిన్నర ఏళ్ళు కావస్తుందన్నారు. ఇప్పటికైనా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందించాలని డిమాండ్ చేశారు. స్థలం ఉన్న వారందరికీ ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని అన్నారు. 57 ఏళ్ళు దాటిన వారికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా పెన్షన్ అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్, నాగేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాక్లూర్: ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేపికి బిజెపి మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామావత్ సురేష్ నాయక్, జిల్లా నాయకులు గంగోని సంతోష్, ఓబీసీ మోర్చా అర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ గంగోని వినోద్, రాజేందర్ రెడ్డి, ఎం. రాజేశ్వర్, శివలాల్, జిట్టా పెద్ద గంగారాం, సంజీవ్, శ్రీనాథ్, సిసింద్రీ, మహేష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీపేట్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదనిబిజెపి ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సరిన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతులకు ఉచిత ఎరువులు, దళితులకు మూడు ఎకరాల భూమి, దళిత బంధు, బీసీ బంధు, డబుల్ బెడ్ రూమ్, పంట నష్టపరిహారం హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆనంద్, రామకృష్ణ, ఎంపీటీసీ మైసరాద, సొసైటీ డైరెక్టర్లు గణేష్, రాము, బాలగంగాధర్ రెడ్డి, రాజేందర్ గౌడ్, రాజశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



నవీపేట్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించేందుకు ఐక్యంగా ఉద్యమిద్దాం

- చెరుకు ఉత్పత్తిదారుల సంఘం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న నాయకులు

చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించేందుకుగాను బలమైన రైతాంగ ఉద్యమాలను నిర్మించాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో చెరుకు ఉత్పత్తిదారుల సంఘం, అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ... ఆసియా ఖండంలోనే పేరుగాంచిన బోధన్ చక్కెర ఫ్యాక్టరీ నాటి ప్రభుత్వం మూత వేసిందని, దానిమీద ఆధారపడిన రైతులు మరియు కార్మికులు రోడ్డున పడ్డార,ని కొంతమంది మరణించారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ తెలంగాణలో సహకార రంగంలో కొనసాగిన ఏకైక ఫ్యాక్టరీ ఎన్సీఎస్ఎఫ్ అని అన్నారు. ఈ ఫ్యాక్టరీ పరిధిలో 114 గ్రామాలలో , 22 వేల ఎనిమిది వందల మంది రైతులు , సభ్యత్వం పొంది రెండు కోట్ల 80 లక్షల మూలధనంతో ఏర్పడ్డ ఈ ఫ్యాక్టరీ 950 మంది రెగ్యులర్ కార్మికులతో 6000 మంది నిరంతరం చెరుకు సప్లై చేస్తూ 1964 నుండి 1996 వరకు మంచి లాభాలతో నడిచిన ఈ ఫ్యాక్టరీని అవినీతి అధికారుల మూలంగా 2008లో నష్టాలు వస్తున్నాయని సాకుతో ఆనాటి ప్రభుత్వం మూత వేసిందని ఆయన అన్నారు. ఈ ఫ్యాక్టరీ 99 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉందని, దానిపై అధికార ప్రతిపక్ష రాజకీయ నాయకులు భూములను చౌకగా కొట్టేయాలని , అనేక ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజులలో జిల్లాలోని చక్కర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదని అన్నారు. చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించి నడిపించాలని లేదా సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని 95 యాక్ట్ ప్రకారం ఆ ఫ్యాక్టరీ పై ఉన్న అప్పులన్నీ మాఫీ చేసి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు నాయక వాడి నరసయ్య , జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం నాయకులు సిరుప నాగయ్య , అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయి రెడ్డి, ఎం. నాగయ్య , వై.సంతోష్ ముప్పగంగారెడ్డి, వెంకటేష్, అజయ్ వడియార్, దు పల్లి లక్ష్మారెడ్డి, సిర్పూర్ గంగారెడ్డి ,బి. సాయిలు, తడకల కృష్ణ గౌడ్, కే . గోపాల్, హనుమాన్లు, బన్సీ, శ్రీనివాస్ రెడ్డి, పర్వయ్య , దేవ స్వామి పాల్గొన్నారు.

ఎంపీసీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నవీపేట్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల నవీపేట్, ప్రస్తుతం వినాయక్ నిజామాబాద్‌లో గల కళాశాలలో ఇంటర్ ఎంపీసీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాగలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఏడాది ఎస్ఎస్సి పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఎస్సీ,బీసీ,ఓసి బాలికలు ఆదాయ విద్యార్హత కుల సర్టిఫికెట్లతో ఈనెల 18న హాజరుకావాలని కోరారు. పదో తరగతి జిపిఎ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఇచ్చిన హామీల కంటే ఎక్కువగానే నెరవేర్చా

- ప్రతిపక్షాల నాయకుల విమర్శలు పట్టించుకోను
- విలేకరుల సమావేశంలో ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత ఎన్నికల సమయంలో ప్రజల కిచ్చిన హామీల కంటే అధికంగానే నెరవేర్చానని, ప్రతిపక్ష పార్టీల నాయకులు చేసే విమర్శలను అసలు పట్టించుకోనని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు సాగునీరు తేవడం లేదని ఆరోపిస్తున్నారని, రైతులకు సాగు నీరు కు ప్రస్తుతం కొదవలేదని అన్నారు. రూ.2000 కోట్లు వ్యయంతో మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల అబద్దపు మాటలను నమ్మి కొందరు రైతులు తమ పంట భూముల్లో నుండి పైప్ లైన్ వేయనీయక పోవడంతో నీళ్లు ఇవ్వలేకపోయామని అన్నారు. పాత డిజైన్ ప్రకారం పనులు జరిగే అవకాశం లేదని, ఈ విషయం గమనించి రైతులు పైప్ లైన్ ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. త్వరలో రూరల్ నియోజకవర్గంలో 300మంది లబ్దిదారులకు బీసీ బంధు కింద ఒక్కొక్కరికి లక్ష చొప్పున అందజేస్తామని తెలిపారు. ముస్లిం మైనార్టీ బంధుకు 100 మంది లబ్దిదారులకు లక్ష చొప్పున అందజేస్తామని అన్నారు. నియోజకవరంలోని 1100 మంది లబ్దిదారులకు దళిత బంధు అందజేస్తామన్నారు. ఎస్సీ జనాభా కనుగుణంగా మండలాల్లో లబ్దిదారులను ఎంపిక చేస్తారని తెలిపారు మండలానికి 400మందికి గృహలక్ష్మి అందజేస్తామన్నారు. సీఎం కేసీఆర్‌ను అడిగి మరో 2 వేలు అదనంగా గృహలక్ష్మికి అనుమతి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

బీటీ రోడ్ల నిర్మాణం కోసం రూ.19.16కోట్లు మంజూరు..

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని చోట్ల లింక్ రోడ్లు లేవని, ప్రజల వినతి మేరకు బీటీ రోడ్ల నిర్మాణం కోసం రూ.19కోట్ల 16లక్షల 50వేలు నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. డిచ్ పల్లి మున్సిపాల్టీ ఏర్పాటు ఎప్పుడౌతుందని ఎమ్మెల్యేను నవతెలంగాణ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఎన్నికల తర్వాత డిచ్ పల్లి మున్సిపాలిటీగా మారుస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు నారాయణరెడ్డి, సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్,సినియర్ నాయకులు శక్కరికొండ కృష్ణ, మోహన్ రెడ్డి, ఎంపిటిసి లు ఫోరం అధ్యక్షులు సాయిలు, యూత్ అధ్యక్షులు అమీర్ ఖాన్,సీరడి పద్మారావు,మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నయీమ్, విఠల్ రావు, అంబర్సింగ్, లింగం యాదవ్,మోహమ్మద్ యూసూఫ్, జగదీశ్, ఇర్ఫాన్, సాకలి సాయిలు, కార్యకర్తలు తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

జవహార్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-తాడ్వాయి
నిజాంసాగర్‌లోని జవహార్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికై దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 28 వరకు గడవు పొడిగించిందని జిల్లా విద్యాశాఖాధికారి రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశం పొందే అభ్యర్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్ నందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆదివారం అనుబంధం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి

శుక్రవారం 18 ఆగస్టు 2023

పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు

నవతెలంగాణ-రాజంపేట్
మండలంలోని కొండాపూర్ గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ లింగాల స్వరూప మాట్లాడుతూ.. ప్రతి పశువుకు గాలికుంటు నివారణ టీకాలు ప్రతి ఒక్కరూ వేయించాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కొండా హనుమాన్లు, జిల్లా పశువైద్యాధికారి సింహారావు, మండల పశువైద్యాధికారి అనిల్‌రెడ్డి, సర్పంచ్ శనిశెట్టి స్వాతి భాస్కర్, పాల కేంద్రం అధ్యక్షులు మధుకర్, వైద్య సిబ్బంది సత్య లింగం, హాజీ, రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా
కాంగ్రెస్ మేనిఫెస్టో రాబోతోంది

● కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్

నవతెలంగాణ-మద్నూర్
వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ సంచలనమైన మేనిఫెస్టో ముందుకు రాబోతుందని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికార బీఆర్ఎస్ పార్టీ దళిత బంధు పథకం పేర్లతో ఎమ్మెల్యేలకు కమీషన్లు పొందడం కోసం ప్రవేశపెట్టిందని తెలిపారు. దళిత బంధు పథకంలో ఏ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు కమీషన్లు పొందారో తన దగ్గర పూర్తి సమాచారం ఉన్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

తెలిపినప్పటికీ అలాంటి కమీషన్లు పొందిన ఎమ్మెల్యేలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. బీసీల కోసం బీసీ బందు తెచ్చారని, అందులో కొన్ని కులాలకు మాత్రమే అందిస్తామనడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే గ్యాస్ సిలిండర్ రూ.500కే అందజేస్తామని, రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, ఎకరానికి 15 వేల పెట్టుబడి సహాయం, భూమిలేని ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం, ఆసరా పెన్షన్లు నాలుగువేలు ఇస్తామని, మహిళ లందరికీ ఉచిత బస్సు సౌకర్యం, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కొనసాగిస్తామని, ఆ పథకాన్ని మరింతగా పెంచుతామన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం, రాజీవ్ ఆరోగ్యశ్రీ 5 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం, అసైన్డ్, పోడు భూముల లబ్దిదారులకు అమ్మకం, కొనుగోలుకు హక్కుపత్రం అందజేస్తామని, వీటితోపాటు రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అందిస్తామన్నారు. మొదట ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నెలకు రూ.4వేలు నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న నాయకులకు గడుగు గంగాధర్ సన్మానించారు. సమావేశంలో పార్టీ నాయకులు హనుమాన్లు స్వామి, రామ్ పటేల్, సాహెబ్ రావు, ధరాస్ సాయిలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగనాథ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల గడువు పెంచాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-బోధన్
నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి ఇండ్ల దరఖాస్తుల గడువును ప్రభుత్వం పెంచాలని సాలూర మండల బీజేపీ అధ్యక్షులు గోనే ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సాలూర మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ గంగాధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైన్స్‌ల టెండర్ల కోసం దరఖాస్తుల గడువు పెంచిందని, కానీ గృహలక్ష్మి ఇండ్ల దరఖాస్తుల గడువు పెంచాలని దాంతో అర్హులైన నిరుపేదలు నష్టపోతున్నారని అన్నారు. బీజేపీ నాయకులు పార్టీ మారడంతో విమర్శలు చేసిన ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ తన గురించి తాను తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. బీజేపీ నాయకులపై లేనిపోని విమర్శలు చేస్తే నియోజకవర్గంలో తిరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో హనాన్స మాజీ సొసైటీ చైర్మెన్ ఈశ్వర్‌రావు పటేల్, మాధవరావు, నర్సింలు, భాస్కర్, గంగయ్య, ముకుంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ


బస్సు షెల్టర్ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

నవతెలంగాణ-లింగంపేట్
మండలంలోని బానాపూర్ గ్రామంలో బస్సు షెల్టర్ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ బండి కవిత నరసింహులు చేతుల మీదుగా గురువారం భూమి పూజ నిర్వహించారు. బానాపూర్ గ్రామంలో బస్సు షెల్టర్ లేక గ్రామస్తులు దూర ప్రాంతాలకు వెళ్లేవారు హెూటళ్ల వద్ద ఇండ్ల వద్ద నిరీక్షించాల్సి వస్తుందని, దీంతో వైస్ ఎంపీపీ విట్టల్‌రెడ్డి సర్పంచ్ కవిత నర్సింలు బస్సు షెల్టర్ లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్ దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించి, తక్షణమే ఐదు లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. వైస్ ఎంపీపీ విటల్ రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రయాణికుల గ్రామస్తుల సౌకర్యార్థం షెల్టర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యం, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు దాసరి సాయిలు, పరమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘ భవనానికి భూమిపూజ


రజక సంఘ భవనానికి భూమిపూజ నిర్వహిస్తున్న చైర్మన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
పట్టణంలోని రజక సంఘం కమ్యూనిటీ హాల్ భవనానికి స్థానిక మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రతి సంఘానికి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఇప్పటికి కొన్ని భవనాలు నిర్మాణంలో ఉన్నాయని వాటిని కూడా తొందరగా పూర్తి చేసుకొని భవనాలు ప్రారంభించాలని కోరారు. రజక సంఘం భవనం తొందరగా నిర్మించాలని ఆయన కోరారు. స్థానిక ఎమ్మెల్యే సురేందర్ ఆదేశానుసారం ఈ భవనానికి భూమిపూజ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ నీలకంఠం, రజక సంఘం నాయకులు లింగం, బాలయ్య, పర్వయ్య, శంకర్, సంగమేశ్వర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల అరెస్టుతో బోధన్‌లో నిరసనలు


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నవతెలంగాణ-బోధన్
తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలంటూ హైదరాబాద్‌లోని స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం వద్ద ముట్టడి నిర్వహించిన సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడంతో ఆ అరెస్టులకు నిరసనగా గురువారం బోధన్ మండల విద్యా వనరుల కార్యాలయం వద్ద, అమ్దాపూర్ గ్రామంలోని కేజీబీవీ విద్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని గురువారం తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న తమ వారిని ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. ఇతర రాష్ట్రాలలో సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తే తెలంగాణ రాష్ట్రంలో పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కావున ముఖ్యమంత్రి కేసీఆర్ తక్షణమే సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధకరించాలని డిమాండ్ చేశారు.

సోయా పత్తి పంటల పరిశీలన


పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్
మండల కేంద్రంలోని సోయా, పత్తి పంటలను ఎల్లారెడ్డి ఏడీఏ నూతన్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ.. సోయా పంటలో రసం పీల్చే పురుగులు పేనుబంక, పచ్చదోమ, తెల్లదోమ, నల్లి వీటిలో పెనుబంక పచ్చ దోమ ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అలాగే పత్తి పంటలో రసం పీల్చే పురుగులు తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక కనిపిస్తుందని రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ తగుజాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

జైల్లో ఉన్న గ్రామస్తులకు సుభాష్‌రెడ్డి భరోసా


బాధితులను పరామర్శిస్తున్న సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్
మండలంలోని ఎక్కపల్లి గ్రామంలో ఇటీవలే జరిగిన ఉద్రిక్తతలో (పోడు భూముల విషయంలో) అక్రమంగా అరెస్టు అయిన నిజామాబాద్ జైలులో ఉన్న ఎక్కపల్లి గ్రామస్తులను కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి గురువారం పరామర్శించారు. గొడవకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అండగా ఉంటానని అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నిజమాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రత్నాకర్, కామారెడ్డి జిల్లా జడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, సదాశివనగర్ మండల సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-తాడ్వాయి
విపత్తు నిర్వహణలో విశేష కృషి సల్పిన వ్యక్తులు, సంస్థల నుంచి సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్ అవార్డులకు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నదని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 23న నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా విపత్తు నిర్వహణలో అద్భుతమైన పనితీరు కనబరచిన వ్యక్తులకు, సంస్థలకు భారత ప్రభుత్వం ప్రతి ఏటా అవార్డును అందిస్తున్నదని అన్నారు. అవార్డుకు ఎంపికైన వ్యక్తులకు, సంస్థలకు మూడు నగదు బహుమతులు అందజేస్తుందని ఆయన తెలిపారు. 2024 సంవత్సరానికి సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్ అవార్డుకు అర్హులని భావించిన వ్యక్తులు లేదా సంస్థలు https://awards.gov.in వెబ్‌సైట్ నందు ఆన్‌లైన్‌లో ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు ఆ వెబ్ సైట్‌ను సందర్శించాలని కలెక్టర్ పాటిల్ సూచించారు.

గ్రామస్తుల తరపున పిటిషన్ దాఖలు చేసిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్
నిజామాబాద్ జైల్లో ఉన్న ఎక్కపల్లి గ్రామస్తుల తరుపున ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు ఏనుగు రవీందర్‌రెడ్డి బుధవారం బెయిలు పిటిషన్‌ను దాఖలు చేశారు. జైల్లో ఉన్న గ్రామస్తులకు ధైర్యం చెప్పి త్వరలోనే బయటకు రప్పిస్తానని భరోసానిచ్చారు. లింగంపేట్ మండలం ఎక్కపల్లి గ్రామంలో జరిగిన ఉద్రిక్తతలో (పోడు భూముల విషయంలో) అక్రమంగా అరెస్టు అయిన నిజామాబాద్ జైలులో ఉన్న ఏక్కపల్లి గ్రామస్తులను కలిసి వారికి ధైర్యం చెప్పి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చి, సంబంధిత అధికారులతో అదేవిధంగా జైలు సూపరింటెండెంట్‌తో మాట్లాడి, అరెస్ట్ అయిన రైతుల కుటుంబాలను కలిసి ధైర్యం చెప్పారు. అనంతరం కామారెడ్డి కోర్టులో న్యాయవాది నారాయణతో కలిసి మాట్లాడారు. ఆయన వెంట లింగంపేట్ మాజీ సర్పంచ్ అఫ్రోజ్, ఎల్లారెడ్డి సింగల్ విండో మాజీ చైర్మన్ సాయిలు, కిష్టయ్యతో పాటు గ్రామస్తులు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి గాయాలు

నవతెలంగాణ-బోధన్‌టౌన్
బోధన్ పట్టణంలో రాకాసిపేట్ రైల్వే స్టేషన్లలో రైల్లో నుంచి నుంచి జారి పడి లతీఫ్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మహబూబ్ నగర్ నుంచి వచ్చిన రైలులో ఉన్న లతీఫ్ అకస్మాత్తుగా కాలు జారి రైలు కిందపడ్డాడు. దీంతో అతని ఎడమ చేయి పూర్తిగా తెగిపోయింది. స్థానికులు గమనించి అతన్ని 108లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

అధికారంలోకి రావడం ఖాయం

● టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్‌మోహన్

నవతెలంగాణ-లింగంపేట్
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్‌మోహన్ అన్నారు. బుధవారం రాత్రి, గురువారం లింగంపేట్ మండలంలోని ఇంటింటికీ మదన్ మోహన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కంచిమల్, కొండాపూర్, కొండాపూర్ తండా, మంబోజిపేట తండాలో ఇంటింటికి వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగడుగునా మహిళలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో రాయడం ఖాయమన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని మేనిఫెస్టో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని ఆయన గ్రామస్తులను కోరారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ


సమావేశంలో మాట్లాడుతున్న మదన్‌మోహన్

సింగిల్ విండో వైస్ చైర్మన్ నారాగౌడ్, డాక్టర్ రాజు, రఫిక్, వాజిద్, ప్రసాద్‌గౌడ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చలో జనగాంకు తరలివెళ్లిన భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
భవన నిర్మాణ రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం ఎల్లారెడ్డి మండలానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు జనగాంకు గురువారం తరలివెళ్లారు. భవన నిర్మాణ రంగాల కార్మిక రాష్ట్ర సంఘం ఏర్పడి 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు కమల ఐలన్న పిలుపు మేరకు ఎల్లారెడ్డి మండలం మౌలాన్ ఖేడ్ గ్రామం భవన నిర్మాణ సంఘ సభ్యులు జనగాం బయలుదేరారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా ప్రచార కార్యదర్శి కుసులకంటి సాయిలు మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగాల కార్మికులకు ఉద్యమ స్ఫూర్తిని నింపాలని బీఎస్ఆర్‌కేఎస్ పోరాటం చేసిన ఫలితంగా అనేకమైనటువంటి సంక్షేమ పథకాలు అనుభవిస్తున్నామని, ఇంకా అనేకమైన సంక్షేమ పథకాలు తీసుకురావాలంటే కేవలం ఒక బీఎస్ఆర్‌కేఎస్‌తోనే సాధ్యమైతదన్నారు. చలో జనగాం బయల్దేరిన వారిలో మౌలాన్ ఖేడ్ ఉపాధ్యక్షుడు నాగేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి బాలరాజ్, కోశాధికారి రాములు, ప్రవీణ్, హనుమంతు, రమేష్, రాజు, మైపాల్, శ్రీనివాస్, చంద్రశేఖర్, సతీష్ కుమార్, శ్రీనివాస్, రజాక్ తదితరులున్నారు.

రిలే నిరాహారదీక్ష విరమించిన ఎంపీటీసీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
మండలంలోని అన్నసాగర్ ఎంపీటీసీ సభ్యురాలు జంగిటి ఉమాదేవి తమ ఎంపీటీసీ పరిధిలోని గ్రామాలలో గల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణ కేంద్రంలో చేస్తున్న రిలే నిరాహార దీక్ష 21వ రోజుకు చేరింది. కాగా గురువారం మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు దీక్ష శిబిరాన్ని సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని దీక్ష విరమింపజేయలని కోరారు. సమస్యల



దీక్ష విరమింపజేస్తున్న మున్సిపల్ చైర్మెన్

పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చి, నిమ్మరసాన్ని తాగించి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు ఉమాదేవి మాట్లాడుతూ సమస్యలు త్వరగా పరిస్కరిస్తామని నీటిపారుదల, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖ, పురపాలక చైర్మన్ ఇచ్చిన హామీ మేరకు దీక్ష విరమిస్తున్నామని, సమస్యల పరిష్కారం కానియెడల మరల తీవ్రస్థాయిలో ఉద్యమం చేపడుతామని అన్నారు.

అన్ని వర్గాలకు బీసీబంధు అందించాలి

● డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించి ఇవ్వాలి

నవతెలంగాణ-మద్నూర్/లింగంపేట్
అన్ని వర్గాలకు బీసీబంధు అందించాలని, అలాగే డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించి ఇవ్వాలని బీజేపీ మండల డిమాండ్ చేసింది. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అన్ని అణగారిన వర్గాలకు, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన బీసీ బంధులానే అన్నీ వర్గాలకు రూ.లక్ష ఆర్థికసాయం అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బి.హన్మాండ్లు, సీహెచ్.హన్మాండ్లు, జనరల్ సెక్రటరీ ఎస్.బాలకిషన్, కె.యాదవరావు, కృష్ణ పటేల్, తులా సంతోష్, గడ్డి తుకారం, లక్ష్మణ్ పటేల్, నాగప్ప పటేల్, మెనూర్ భూమాగౌడ్, యోగేష్ పటేల్, విఠల్ ఎక్లరా, మీర్జాపూర్, శక్కర్గ, తాడ్గురు, అనంతపూర్ తదితర గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి..

లింగంపేట్ : ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ మేరకు గురువారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ ముందర ధర్నా చేశారు. అనంతరం ఎమ్మార్వో చంద్ర రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు దత్తురాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు జక్సాని దత్తు రాములు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బొల్లారం సాయిలు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు ఉదేష్ కుమార్, యువ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ మార్గం సుభాష్, బీజేపీ సీనియర్ నాయకులు కత్తూరి కిషన్, చిరంజీవులు, సత్యనారాయణ, ముకుందరెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలి

నవతెలంగాణ-పిట్లం
గృహలక్ష్మి పథకం దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీ లించాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల వారీగా గృహలక్ష్మి పథకానికి లబ్దిదారులు చేసుకున్న దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలని పంచాయతీ సెక్రెటరీలను ఆదేశించారు. దరఖాస్తు చేసుకున్నవారు అర్హులైతే ఇల్లు నిర్మాణం చేసుకునే వారిని ఎంపిక చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మం, ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీవో

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-రాజంపేట్
మండలంలోని బసవన్నపల్లి గ్రామంలో సర్పంచ్ శ్రీజ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయ కులు గురువారం పాలాభి షేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీజ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. బసవన్నపల్లి నుంచి సోమవారం వరకు సుమారు మూడు కోట్ల 65లక్షలతో 3.8 కిలోమీటర్ల మేర బీటీ రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు గాను ఎంతో సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుమలత, గ్రామ పార్టీ అధ్యక్షులు బాణాల గంగారెడ్డి, సెక్రటరీ సంతోష్‌రెడ్డి, గడ్డం రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు ప్రణీత్‌రెడ్డి, రూపేష్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, రాజారెడ్డి, బాలరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీఎం చిత్రపటాకి పాలాభిషేకం చేస్తున్న పలువురు

యువజన విభాగం మండల ఉపాధ్యక్షులుగా మున్నూరు ప్రణయ్ కుమార్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కాంగ్రెస్ యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా మున్నూరు ప్రణయ్ కుమార్‌ను నియమించినట్టు యువజన విభాగం అధ్యక్షుడు వినోద్ గురువారం తెలిపారు. నిజామాబాద్‌లో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో భాగంగా మండలంలోని కేశ్‌పల్లి గ్రామానికి చెందిన మున్నూరు ప్రణయ్ కుమార్‌ను యూత్ కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్‌గా జిల్లా అధ్యక్షులు విక్కీ యాదవ్, రూరల్ అధ్యక్షులు ఉమ్మజీ నరేష్, మండలం యువజన విభాగం అధ్యక్షులు సొప్పరీ వినోద్ నియామక పత్రం అందజేశారు. రానున్న ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మామిడిపల్లి నవీన్ సురేష్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కోర్స్ దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజరలోగల సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం పూర్వ ఉపాధ్యాయ శిక్షణ ఒకేషనల్ కోర్సులో ప్రవేశానికి అర్హత గల బాలికల నుండి ప్రవేశానికి దరఖాస్తు కోరుతున్నట్లు కళాశాల ప్రధానోపాధ్యాయులు జి. మాధవి లత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 మార్చి ఏప్రిల్ నెలలో. నిర్వహించిన ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షలో ఉత్తీర్ణులైన ఎస్సీ ఎస్టీ బీసీ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. మెరిట్ లిస్టు ప్రకారం సీట్లు కేటాయించబడతాయని, వర్జినల్ సర్టిఫికెట్స్ మరియు ఆదాయత్రువీకరణ కుల ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 18 వరకు సంప్రదించాలని సూచించారు.

మల్కాపూర్ తండాలో గృహలక్ష్మిపై విచారణ

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్


విచారణ చేపడుతున్న అధికారులు

నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్ తండాలో ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్ నాయక్ ఆదేశానుసారం గురువారం గృహలక్ష్మి దరఖాస్తులపై విచారణ చేపట్టారు. విచారణ అధికారి, అగ్రికల్చర్ ఆఫీసర్ జాదవ్ హీర గృహలక్ష్మి లబ్దిదారుల ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తర్వాత రిపోర్ట్ పంపిస్తామని వెల్లడించారు.

ఇంటింటికీ తెలుగుదేశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో బాగాంగ గాజులపేట్, బోయి గల్లిలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం గురువారం నిర్వహించారు. పార్టీ కరపత్రాలను పంచుతూ తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ కేసిఆర్ పాలనలో తెలంగాణకు చేసిందేమీ లేదని, దోచుకో దాచుకొ అను రీతిలో పాలన ఉందని అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్ మండిపడ్డారు. కార్యక్రమంలో కల్లెడ గంగాధర్, శంకర్ ముదిరాజ్, షేక్ ఫిరోజ్, అశోక్ అర్సపల్లీ, నవతే నరసయ్య, రమేష్ గౌడ్, నాగేశ్వరరావు, ఆతిక్, సాయిలు, హరీష్, అఫ్సర్, కాలిమ్, అమీర్, సోహైల్ పాల్గొన్నారు.

నుడా ఛైర్మన్‌ను కలిసిన గోపాల్ నాయక్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ఏకగ్రీవంగా ఎన్నికైన నుడా ఛైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డిని బోర్గాంలో తన నివాసం వద్ద ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు గోపాల్‌నాయక్ గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్ నాయక్, మండల ఎస్టీసెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జెట్టి మొగులయ్య, ప్రభాకర్ తదితరులు శుభాభివందనలు తెలిపారు.

మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై 29న చలో హైదరాబాద్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నరేంద్ర మోడీ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త ఆందోళన పిలుపులో భాగంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ ఈనెల 29న చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిందని నిజామాబాద్ నగర కార్యదర్శి ఎం శివకుమార్ తెలిపారు. నగరంలోని. ఎన్ఆర్ భవన్ లో పాత్రికేయుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మోడీ ఎన్నికల వాగ్దానాలను విస్మరించి, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికుల మెడకు ఉరితాలు బిగించారని వారన్నారు. పెద్ద నోట్ల రద్దుచేసి, నల్లధనాన్ని వెలికి తీసి, ఒక్కో పేదకుటుంబానికి ఒక్కొక్కరికి 15 లక్షలు జమ చేస్తానన్న మాట నీళ్ల మూటగా మారిందని వారు అన్నారు. ప్రతి ఏటా రెండు కోట్ల కొలువులు కల్పిస్తామని హామీ ఇచ్చి, దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నీ బహిరంగంగా వేలం వేస్తున్నారని వారు తెలిపారు. రాజ్యాంగాన్ని విధ్వంసం చేసే కుట్ర ఆర్ఎస్ఎస్ ఆదేశాలతో మోడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2016 అక్టోబర్ 26 సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన మోడీ సర్కార్ అమలు చేయకుండా కార్మికులకు మోసం చేసిందని వారు తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆందోళన చేస్తున్న ప్రశ్నిస్తున్న వారిని నిర్బంధిస్తోందని, వారన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. సమావేశంలో నగర నాయకులు మోహన్, మురళి, ఎల్లప్ప శంకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఏఎన్ఎంల సమ్మె

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఏఐటియుసి ఆధ్వర్యంలో రెండో ఏఎన్ఎంల సమస్యలపై నిర్వహిస్తున్న సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా నూతన కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన అనంతరం అక్కడి నుండి ప్రదర్శనగా ఖానాపూర్ రోడ్డులో గల ఏఐటియుసి కార్యాలయం వరకు చేరుకున్నారు. అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి సంధ్యారాణి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య మాట్లాడుతూ.. రెండు రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. నిన్న చర్చల కు పిలిచిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ శ్రీనివాసరావు నిర్లక్ష్యంగా మాట్లాడారని తెలిపారు. డిపార్మెంట్లలో పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేసే రాష్ట్ర ప్రభుత్వం రెండో ఈసీఐఎల్‌లను ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. అందరినీ రెగ్యులర్ చేసి సమ్మెను విరమింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు హనుమాన్లు, సాయి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భాగ్యమ్మ, నాయకులు సవిత, రాణి, సరస్వతి, సావిత్రి, శశికళ, రెండో ఏఎన్ఎంలు, ఈసీ ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


నవతెలంగాణ-సిరికొండ

మండలానికి చెందిన కల్యాణ లక్ష్మీ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్వగ్రామంలో చిన్ననాటి చిరకాల మిత్రుడు అవుసుల లక్ష్మయ్య ఇటీవలే మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు నిర్ణయించాలి

- లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తాం
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్


ధర్నాలో ఆశ వర్కర్స్

ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం 18వేలు నిర్ణయించాలని లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. గురువారం నిజామాబాద్ జిల్లా సిఐటియు కార్యాలయంలో ఆశా వర్కర్ల జిల్లా ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశ వర్కర్స్ 18 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని, ఇప్పటివరకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయం చేయకుండా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని అన్నారు. నిత్యావసరాలు ధరలు, పని భారం కూడా బాగా పెరిగిందని తెలిపారు. ఆశాలకు గతంలో ఇచ్చిన హామీలు కూడా ప్రభుత్వం ఇంకా అమలు చేయడం లేదని, రిజిస్టర్ ఇవ్వలేదని, యూనిఫామ్ క్వాలిటీ ఉండటం లేదని, అనేక ప్రాంతాల్లో రెస్ట్ రూమ్‌లు కూడా ఏర్పాటు చేయలేదని, జాబ్ చార్ట్ కూడా ఇంకా ఇవ్వలేదని అన్నారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా ఆఫీస్ బేరర్ రేణుక, సుకన్య, బాలమణి, రమ, లావణ్య, విజయ రాజమణి, లావణ్య, శాంతి ఎల్ సుజాత సిహెచ్ పద్మ వర్ష శోభ పాల్గొన్నారు.

కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి

- ఎస్ఎఫ్ఐ
- శిథిలావస్థలోని హాస్టళ్లను సందర్శించి అభివృద్ధి చేయాలి
- సంక్షేమ హాస్టల్స్‌కు భవనాలను నిర్మించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి


తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ హాస్టల్లను సందర్శించి నిధులను కేటాయించి వెంటనే అభివృద్ధి చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఇంటర్మీడియట్ కళాశాల నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించి తహసిల్దార్‌కు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిచ్ పల్లి ప్రాంతంలోని బాలికల హాస్టల్ శిధిల వ్యవస్థలో ఉందని దానికి వేంటనే నిధులను మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గత ఐదు నెలల నుండి జీతాలు రాకపోవడం బాధాకరమని, ఏజెన్సీలతో వెంటనే జీతాలు అందించేటట్టుగా కృషి చేయాలని అన్నారు. ఎస్టీ బాయ్స్ పాఠశాల విద్యార్థులకు గదులు సరిపోక ఒకే గదిలో 20 మంది నిద్రిస్తున్న పరిస్థితి దాపురించిందని వెంటనే విద్యార్థులకు పక్కా భవనాలు నిర్మించాలన్నారు. లేకపోతే ఈనెల 21న కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు లవిశెట్టి ప్రసాద్, శివరాత్రి వెంకటేష్, యూనివర్సిటీ ఉపాధ్యక్షురాలు సంధ్యారెడ్డి, నాయకులు మిథున్, లక్ష్మి ప్రజ్ఞ, ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో సమీకృత కలెక్టర్ కార్యాలయం నందు ధర్నా నిర్వహించి, ఎస్సీ ఎస్టీ బీసీ శాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా నిజామాబాద్ నగర కార్యదర్శి పోశమైన మహేష్ మాట్లాడుతూ నిజామాబాద్ నగర కేంద్రం ఒక ఎడ్యుకేషనల్ హబ్‌గా ఉండి అనేక వేల మంది విద్యార్థులు సుదూర ప్రాంతాల నుండి వచ్చి ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా సంక్షేమ హాస్టల్లో సీట్లు లేక బయట హాస్టల్లో ఉండలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదేవిధంగా ఉన్న హాస్టల్స్ కూడా కొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, కొన్ని మరమ్మత్తులు చేయాల్సి నటువంటి బిల్డింగులు కూడా ఉన్నాయని తెలిపారు. అలాగే సంక్షేమ హాస్టల్లో ప్రతినెలకో సారి ఎంబీబీఎస్ డాక్టర్‌తో హెల్త్ క్యాంపు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీల బిల్లులను విడుదల చేయాలని, విద్యార్థుల సంఖ్య కనుగుణంగా హాస్టల్లో సీట్ల సంఖ్య పెంచాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే హాస్టల్ విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు విశాల్ నగర ఉపాధ్యక్షులు దీపిక, గణేష్ నగర నాయకులు శ్రీకాంత్, సాయికిరణ్, సజన్, కార్తీక్ మరియు హాస్టల్ కమిటీ నాయకులు శివ, బాబురావు, సజన్ పాల్గొన్నారు.

21న సభకు హాజరుకావాలి

- చక్కెర ఫ్యాక్టరీని నడిపించే అధికారం మాకు ఇవ్వండి
- భారతీయ కిసాన్ సంఘ్

నవతెలంగాణ-మోపాల్


సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

ఎన్‌సిఎస్ఎఫ్ ఫ్యాక్టరీని తెరిపించేటట్టు ఈనెల 21న కలెక్టరేట్లో జరిగే సభకు రైతులందరూ పెద్ద మొత్తంలో హాజరుకావాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు కూచన్‌పల్లి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని తానకుర్తి, ఇతర గ్రామాలకు చెందిన రైతులకు గురువారం ఆయన ఫ్యాక్టరీ గురించి వివరించారు. 1958లో కోట్ల రూపాయల వాటాధనం జమచేసి దీనిని 1962 లో ప్రారంభించారన్నారు. ఇది రైతులు, కర్షకులు, కూలీలు, ట్రాక్టర్లకు లాభం చేకూర్చడానికి రాష్ట్రంలోనే ఉత్తమ చక్కర ఫ్యాక్టరీగా ఎన్సిఎస్ఎఫ్ పేరుపొందిందన్నారు. కానీ జిల్లాలోని కొందరు రాజకీయ నాయకులు స్వార్థంతో ఏడుకోట్ల 16 లక్షలకే కొనుగోలు చేయాలని చూశారని తెలిపారు. 2014లో 100 రోజులలో ఫ్యాక్టరీ నడుపుతామని హామీ ఇచ్చి ఇక్కడ పాలకులు గెలిచారని, తర్వాత దాన్ని పట్టించుకునే నాధుడే కరువయ్యాడని అన్నారు. రూరల్ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో అప్పటి మంత్రిగా ఉన్న పోచారం శ్రీనివాస్ రెడ్డిని 500 మంది రైతు వాటాదారులతో సమావేశం పెట్టి ఫ్యాక్టరీ నడపాలని తీర్మానించగా ఫ్యాక్టరీని ప్రారంభిస్తామని రైతులకు అప్పగిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. వాటాదారులు విజ్ఞప్తులు చేసిన, ఆందోళనలు, పాదయాత్రలు, సభలు జరిపినప్పటికి ప్రభుత్వం నుండి ఎలాంటి సమాధానం లేదని చెప్పారు. ఫ్యాక్టరీని రైతులకు ఇప్పించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, చెరుకు వల్ల షుగర్ ఉత్పత్తితోపాటు, ఇథనాల్ ఉత్పత్తి కూడా ప్రారంభించవచ్చని అఖిలభారత చెరుకు విభాగం కన్వీనర్ కొండలవాడి సాయి రెడ్డి తెలిపారు. భావితరాలకు ఫ్యాక్టరీ ఆనవాళ్లు లేకుండా పోతాయని, అందులో ఇప్పటికీ ఖరీదైన యంత్రాలు తుప్పు పట్టి దేనికి రాకుండా పోతున్నాయని అన్నారు. అలాగే ఫ్యాక్టరీ ఉన్న స్థలం కోట్ల రూపాయల విలువగలదని, ఒకవేళ దాని కోసం ఫ్యాక్టరీ తెరిపించడం లేదా మరి ఇతరమైన కారణాలు ఉన్నాయా అనేది రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు తెలియ పరచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలకు, ఎన్నో ప్రాజెక్టులను నిర్మించడానికి కొన్ని వేల కోట్ల ప్రజాధనం ఖర్చు పెడుతుందని తెలిపారు. అటువంటి అప్పుడు ఒక జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలో రైతులు బాగుపడతారంటే ఫ్యాక్టరీని ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా ఫ్యాక్టరీని తెరిపించి రైతులకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో రైతు విభాగం తెలంగాణ ఇంచార్జ్, అఖిల భారత కార్యవర్గ సభ్యులు నాన ఆక్రే, తానకుర్తి గ్రామ అధ్యక్షుడు అంగలి రవీందర్, మాజీ ఏఎంసి డైరెక్టర్ రాజారెడ్డి, పిఆర్‌ఓ సాయినాథ్, సురేష్, రాజు, గ్రామ రైతులు పాల్గొన్నారు

విజయ్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

స్థానిక విజయ్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు, విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కాలేజ్ విద్యార్థులు కలిసి సుమారు 50 మంది విద్యార్థులు రక్త దాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ.. రక్తం అత్యవసర పరిస్థితిలో పేషంట్ల కు ఉపయోగపడుతుందని తెలిపారు. విజయ్ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు రక్త దానం చేయడం వల్ల కొత్త రక్త కణాలు ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రుధిర బ్లెడ్ సెంటర్, సందీప్ రావు, డాక్టర్ శ్రీకాంత్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

19న 5కే రన్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 19న ఉదయం 6 గంటలకు జిల్లాలో 'ఐ ఓట్ ఫర్ షూర్' అనే నినాదంతో 5కె రన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిస్తూ.. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వీలుగా జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, బాన్సువాడ, ఆర్మూర్, బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 5కె రన్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని 5కె రన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఛైర్‌పర్సన్‌గా డా.మధుశేఖర్

- శుభాకాంక్షలు తెలిపిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-వేల్పూర్


మధు శేఖర్‌ను సన్మానిస్తున్న మంత్రి

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఛైర్‌పర్సన్‌గా డా. మధు శేఖర్‌ను నామినేట్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం ఆయన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి డా. మధు శేఖర్ కు శుభాకాంక్షలు తెలిపారు. తనకు అత్యంత అప్తుడైన డా. మధు శేఖర్‌కి ప్రతిష్టాత్మక పదవి రావడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ కి ధన్యవాదాలు తెలిపారు.ఛైర్పర్సన్ తో సహా మొత్తం 13 మందితో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ సంస్థ కార్యకలాపాలు నిర్వహించనుంది.

ఈ బోర్డ్‌లో హెల్త్ సెక్రటరీ వైస్ ఛైర్మన్‌గా, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్, నిమ్స్ డైరెక్టర్ ఫైనాన్స్ సెక్రటరీ, తదితరులు సభ్యులుగా ఉంటారు. వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎం, ఆరోగ్య సంరక్షణ సిబ్బంది కోసం శిక్షణ ఇచ్చే ఉన్నత స్థాయి సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్. ప్రత్యేక ప్రజారోగ్యం, వైద్య రంగంలో వివిధ అధ్యయనాలను చేపట్టేందుకు పరిశోధనా సంస్థగా పనిచేయనుంది. గతంలో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఛైర్మన్‌గా ఉంటున్న ఇనిస్టిట్యూట్‌ని కార్పొరేషన్ గా మార్చి తొలి ఛైర్మన్ గా డాక్టర్ మధుశేఖర్ ని ప్రభుత్వం నియమించడం జరిగింది.

సీఎం కేసీఆర్‌ని కలిసిన తెలంగాణ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ డి.రాజేశ్వర్‌రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్


సీఎంను సన్మానించిన రాజేశ్వర్‌రావు

తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్‌గా డి.రాజేశ్వర్ రావు నియమితులైన తరువాత మొదటిసారిగా ముఖ్యమంత్రి కల్వ కుంట్ల చంద్రశేఖర్‌రావును గురువారం ప్రగతి భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. తనకు క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. క్రిస్టియన్ల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ భవనానికి రూ.7.50 లక్షలు మంజూరు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్


ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాల నిర్మాణం కోసం ఆర్టీసీ ఛైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తన ఎస్‌సీడీడీ నిధుల నుంచి రూ. 7.50 లక్షలను అందించారు. నిజామాబాద్ రూరల్ మండలం ముబారక్ నగర్ గ్రామానికి చెందిన మాదిగ సంఘానికి 7.50 లక్షలు ప్రొసిడింగ్ ఆర్డర్స్ పత్రాలను పంపిణీ చేశారు. ఎస్సీ కమ్యూనిటీ సోదరులు తమ సొంత స్థలంలో భవన నిర్మాణం చేసుకుంటామని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి కోరారు. ఈ మేరకు ఆయన నిధులనుండి కేటాయిస్తూ ప్రొసీడింగ్ ఆర్డర్స్ పత్రాలను సంబంధిత ఎస్సీ కమ్యూనిటీ కుల సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కమ్యూనిటీ కులసంఘ సభ్యులు తదితరులు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా యువ నాయకులు, జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు, ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేటర్ అనిల్ , మండల అధ్యక్షులు మధుకర్ రావు, ఎస్సీ కమ్యూనిటీ సోదరులు, సర్పంచులు, ఉప సర్పం చులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడుగా జమీల్ పాషా నియామకం


అధ్యక్షులుగా జమీల్ పాషా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ కాంగ్రెస్ భవన్ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఇర్ఫాన్ అలీ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి ఆధ్వర్యంలో షేక్ జమీల్ పాషా కు ఇందల్‌వాయి మండల కాంగ్రెస్ మైనారిటీశాఖ అధ్యక్షులుగా నియమితులయ్యారు. నిజామాబాద్ కాంగ్రెస్ భవన్‌లో గురువారం నియామక పత్రాలను అందజేశారు. ఎస్ కె.జమీల్ పాషా ది ఇందల్ వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామం. జమీల్ పాషా మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గేలుపే ధ్యేయంగా పని చేస్తానని వివరించారు. కార్యక్రమానికి జిల్లా కిసాన్ ఖేత్ అధ్యక్షులు ముప్ప గంగా రెడ్డి, డిసిసి సెక్రెటరీ భాస్కర్ రెడ్డి, ఇందల్ వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్యారి నవీన్ గౌడ్, కిసాన్ ఖెత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎల్ ఐ సి గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, జిల్లా, మండల మహిళా నాయకులు పాల్గొన్నారు.

మహమ్మద్ అబ్దుల్ ఖవికి రాష్ట్ర ఉత్తమ ఉర్దూ అధ్యాపక అవార్డు

నవతెలంగాణ-డిచ్‌పల్లి


రాష్ట్ర ఉత్తమ ఉర్దూ అధ్యాపక అవార్డు అందుకున్న అబ్దుల్ ఖవి

తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖవికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ అకాడమీ, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ డిపార్మెంట్ సంయుక్త నిర్వహణలో ఉర్దూ శాఖలో ఉత్తమ అధ్యాపక అవార్డు రావడం తెలంగాణ యూనివర్సిటీకి గర్వకారణమని తెలంగాణ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి అన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మహమ్మద్ అబ్దుల్ ఖవిని శాలువా మెమోంటోతో పాటు ప్రశంసా పత్రం ఇచ్చి ఘనంగా సత్కరించారు. డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖవి 2014 నుంచి తెలంగాణ యూనివర్సిటీ అధ్యాపకులుగా సేవలు అందిస్తున్నారు. అబ్దుల్ ఖవి రాసిన పుస్తకాలు అంబేద్కర్ యూనివర్సిటీ, మాను యూనివర్సిటీ రిఫరెన్స్ గ్రంథాలుగా గుర్తించ బడిందని వివరించారు. లండన్ లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో తెలంగాణ రాష్ట్ర ఉర్దూ మౌలిక పరిశోధకుడిగా భాషా సాహిత్యంపై పత్ర సమర్పణ చేసి ఉత్తమ పరిశోధకుడుగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. అనేక అంతర్జాతీయ సదస్సులో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వాకాటి కరుణ సైతం అభినందనలు తెలిపారు. ఉర్దూ విభాగాధిపతి డాక్టర్ గుల్ -ఇ -రాణా, ఛైర్మన్ బిఓఎస్ డాక్టర్ మూసా ఖురేష్, అధ్యాపక మిత్రులు మొహమ్మద్ అబ్దుల్ ఖవిని అభినందించారు.

30న సదస్సుకు తరలిరావాలి

- అఖిల భారత రైతుకూలీ సంఘం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని పెద్ద వాల్గోట్ గ్రామంలో గురువారం అఖిలభారత రైతు కూలీ సంఘం నిజామాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు బాకారం గంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి అఖిలభారత రైతు కూలీసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మట్లాడుతూ... దేశంలో మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక మూడు చట్టాలతోపాటు విద్యుత్ సవరణ బిల్లు తెచ్చి రైతులనడ్డి విరుస్తున్నాడని ఆయన విమర్శించారు. రైతువ్యతిరేక మూడు నల్లచట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న నిజామాబాద్ జిల్లా ఎస్‌కెఎం సదస్సులో పెద్ద ఎత్తున రైతులు పాల్గొని సదస్సు విజయ వంతంచేయాలని జిల్లా కార్యవర్గం తీర్మానంచేసిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి. గంగాధర్ తోపాటు జిల్లా కార్యవర్గ సభ్యులు, పోతిరెడ్డి నారాయణ, శంకర్, ఉశన్న, రాజేశ్వర్, డి.కే.గంగయ్య, నడ్పిన్న, గొల్ల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

NOTICE
IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT BODHAN

E.A.No. 7 OF 2023
IN
E.P.No. 34 OF 2019
IN
O.S.No. 30 OF 2006

BETWEEN:
Sri. Jilkar Madhava Rao, S/o. Sayanna, Hindu, aged about 71 years, Occ; Agriculture, R/o.H.No.4-67, Amdapur (v) of Bodhan, Dist. Nizamabad, T.S.
...Petitioner/D.H.R.

AND

Suryakanth, (died). Lrs.
1) **Smt. Laxmi** W/o. Late Suryakanth, Hindu, aged about 65 years, Occ: Housewife R/o.H.No.2-6-433, Narsi Road Bodhan.
2) **Smt. Radha** D/o. Late Suryakanth, Hindu, aged about 45 years, Occ: Housewife R/o.H.No.2-6-433, Narsi Road Bodhan.
2) **Srinivas** S/o. Late Suryakanth, Hindu, aged about 40 years, Occ: Business, R/o.H.No.2-6-433, Narsi Road Bodhan.

Proposed Respondents/ Proposed Lrs. of JDR.

Take notice that the above E.A. is posted for your appearance i.e. Proposed Respondents No.1 & 2 on **11-09-2023** before the Sr. C.J. Court Bodhan at 10:30Am, for bringing you both on record, as Lrs, in E.P.No.34/19, in the place of deceased Suryakanth, who was the JDR in the above E.P.

You the proposed Lrs. No.1 and 2, i.e. 1) **Smt. Laxmi** 2) **Smt. Radha,** are hereby informed to appear before the Sr. C.J. Court Bodhan on **11-09-2023** at **10:30Am,** failing which the matter will be heard and decided as per the law.

//By order of the court//

Date: 17-08-2023.
Place: Bodhan.

K. Dattatri Rao
Advocate-Bodhan.